


# నవభూమి వరంగల్
అనుబంధం
23 మార్చి ,2025 ఆదివారం పేజీలు:5
www.epaper.navabhoomi.in


## కొమ్మూరి ప్రతాప్ రెడ్డి తల్లి దశదినకర్మ కార్యక్రమంలో
# పాల్గొన్న హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

- పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**పాలకుర్తి నవభూమి మార్చి 22** జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,తల్లి కొమ్మూరి సతమ్మ గారి దశదినకర్మ కార్యక్రమంలో,పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ..సతమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..కొమ్మూరి సతమ్మ ఒక ఆదర్శమయిన గృహిణిగా, సమాజానికి సేవ చేసిన శ్రేయోభిలాషిగా పేరుగాంచారు. సత్తెమ్మ విలువలు, కుటుంబానికి అందించిన మద్దతు, ఆదర్శంగా నిలుస్తుంది. ఇటువంటి కుటుంబం నుండి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,వంటి నాయకులు రాజకీయ రంగంలో అభివృద్ధి చెందడం గర్వించదగిన విషయం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, బంధువులు హాజరై, తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# పాలకుర్తి ఎమ్మెల్యే ఆదేశాలతో...

- సీసీ రోడ్ల పనులు ప్రారంభించిన పట్టణా కాంగ్రెస్ అధ్యక్షులు కమ్మగాని నాగన్న
- పాలకుర్తి పట్టణా కాంగ్రెస్ అధ్యక్షులు కమ్మగాని నాగన్న
- మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్

**పాలకుర్తి నవభూమి మార్చి 22** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో నియోజకవర్గ ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్విని ఝాన్సీ రెడ్డి సహకారంతో,పెండింగ్లో ఉన్నటువంటి సీసీ రోడ్ల పనులను పాలకుర్తి పట్టణా కాంగ్రెస్ అధ్యక్షులు కమ్మగాని నాగన్న,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్ ఆధ్వర్యంలో..శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో.. మాజీ టీపీసీసీ మాజీ సర్పంచ్ గంగు కృష్ణమూర్తి అయ్యగారు, మాజీ సర్పంచ్ యకాంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెనుగొండ రమేష్,పాలకుర్తి పట్టణ సెక్రెటరీ పన్నీరు వెంకన్న,కమ్మగానీ రామ్ చంద్రు మాజీ కోఆప్షన్, మైనార్టీ నాయకులు సలీం భాయ్, శ్రీనివాస్ రావు, కొంగరి రాములు, కొంగరి శేఖర్,కదుదుల సురేష్ రామయ్య,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## దేవరుప్పుల మండల వివిధ గ్రామాల మహిళ అధ్యక్షులతో
# సమీక్ష సమావేశం

- పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి




**పాలకుర్తి నవభూమి మార్చి 22** జిల్లాలోని దేవరుప్పుల మండల పార్టీ కార్యాలయంలో మండల వివిధ గ్రామాల మహిళ అధ్యక్షులతో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ..మహిళల పాత్ర రాజకీయాల్లో కీలకమైందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి మహిళల భాగస్వామ్యం అవసరమని, ప్రతి మహిళా అధ్యక్షురాలు తమ గ్రామంలో పార్టీ కార్యక్రమాలు, ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు..పార్టీ కార్యాచరణలో మహిళల భాగస్వామ్యం. మహిళలూ నాయకత్వ పదవులు పొందాలని, పాసివ్‌గా కాకుండా యాక్టివ్‌గా పార్టీలో భాగం కావాలని ఝాన్సీరెడ్డి ఆకాంక్షించారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళా అధ్యక్షులు పక్కాగా సమాచారం కలిగి ఉండాలని, సమస్యలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లే బాధ్యతను నిర్వహించాలని చెప్పారు. ప్రతి బూత్‌లో పార్టీ బలపడేలా కార్యాచరణ రూపొందించాలని, మహిళల ద్వారా ఓటర్లతో నేరుగా సంబంధాలు పెంపొందించాలని సూచించారు. పార్టీ తరఫున చేసే సేవా కార్యక్రమాలలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని, అది ప్రజలతో సంబంధాలను బలోపేతం చేస్తుందని తెలిపారు. పార్టీ కార్యకలాపాల్లో తనకు వచ్చిన అనుభవాలను షేర్ చేస్తూ, మహిళలు రాజకీయాల్లో ఎదుర్కొనే సవాళ్లు, అవగాహనలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశం చివర్లో, అన్ని గ్రామాల మహిళా అధ్యక్షుల అభిప్రాయాలు విని,రాబోయే కార్యాచరణపై స్ఫూర్తినిచ్చే సూచనలు చేశారు. మహిళల నడుమ సంఘీభావం పెరిగేలా పిలుపునిచ్చారు.

# రూ. 20.75 లక్షల పరిహారం



## డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

### హీట్‌స్ట్రోక్ నుండి ప్రజలను కాపాడాలి: డిప్యూటీ డిఎంహెచ్ఓ విపిన్ కుమార్



**మంగపేట, మార్చి 22(నవభూమి):** మంగపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విపిన్ కుమార్ , ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ రణధీర్ కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పెషేంట్స్ కి సంబందించిన ఇన్వార్డ్, ఔట్వర్డ్ అలాగే అన్ని రికార్డులను పరిశీలించారు. వేసవిలో ఎండల తీవ్రత ఇంకా పెరిగే అవకాశం ఉన్నందున ఎండ బారిన పడే వారికి ఇచ్చే వివిధ రకాల హెచ్ఆర్ఐ (హీట్ రిలేటెడ్ ఇన్ఫెక్షన్లు),ఓఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని కోరారు. హీట్‌స్ట్రోక్ (వడదెబ్బ) పై సంసిద్ధత గురించి మెడికల్ ఆఫీసర్స్ మరియు సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మందుల స్టాక్ లభ్యత, సమయాల నిర్వహణ గురించి అరా తీశారు.

## దాట్ల హైస్కూల్‌లో ప్రపంచ నీటి దినోత్సవం

### ఇంచార్జ్ హెచ్ఎం రాపోలు విజయకుమార్

**దంతాలపల్లి మార్చి 22 నవభూమి ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం దాట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ హెచ్ ఎం రాపోలు విజయ్ కుమార్ అధ్యక్షతన ప్రపంచ నీటి దినోత్సవం బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ హెచ్ ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రేత్యేక దినములలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని, నీటిని వృధా చేయకుండా వాడిన నీటిని నిల్వ చేయుటకు మన పరిసర ప్రాంతాల్లో నీటి గుంతలను ఏర్పాటు చేయాలని, నీటి వృధా ఇలాగే కొనసాగితే నీటి యుద్ధాలు జరుగుతాయని వివరించారు. అనంతరం పిల్లలకు వ్యాస రచన, పాటలు, చిత్ర లేఖనం తదితర పోటీలు నిర్వహించి సందేశం ఇచ్చిన అనంతరం బహుమతులు అందజేశారు. తొలుత బాలవికాస వారి ఆధ్వర్యంలో పిల్లలు ర్యాలీ, మానవ హారం, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ హెచ్ ఎం ఉపధ్యాయులు, హై స్కూల్ ఉపాధ్యాయులు స్వప్న, రమేష్, ప్రేమకుమార్, రామయ్య, సాయికుమార్, రోషిణి, యాక స్వామి, మాధవి, రిషిత బాలవికాస ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






### మహబూబాబాద్ ఎస్పీ భరోసా సెంటర్ సందర్శన: 56 మంది బాధితులకు

# రూ. 20.75 లక్షల పరిహారం

**మహబూబాబాద్ టౌన్ మార్చి 22, నవభూమి:** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ శనివారం భరోసా సెంటర్‌ను సందర్శించి, అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన చొరవతో 2022 నుంచి 2024 వరకు భరోసా కేంద్రం ద్వారా 56 మంది బాధితులకు ప్రభుత్వం తరపున రూ. 20,75,000 (ఇరవై లక్షల డెబ్బై ఐదు వేల రూపాయలు) బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయడం జరిగింది. ఈ పరిహారం మంజూరైన మొత్తం ఎస్పీ ప్రత్యేక ఆసక్తితో సంబంధిత అధికారులతో చర్చించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాయిదా పడకుండా వెంటనే విడుదల చేయించబడింది. ఈ కృషి చేసిన డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ సరవయ్యలను ప్రత్యేకంగా అభినందించారు. పరిహార పంపిణీ వివరాల్లో ఎఫ్ఐఆర్ దశలో 50 మంది బాధితులకు రూ. 12,50,000, ఛార్జ్‌షీట్ దశలో 23 మంది బాధితులకు రూ. 5,75,000, తీర్పు (జడ్జిమెంట్) దశలో 5 మంది బాధితులకు రూ. 2,50,000 జమ చేయడం జరిగింది. ఎస్పీ సూచనల మేరకు భరోసా యంత్రాంగం మరింత సమర్థంగా పని చేసి బాధితుల ఖాతాల్లోకి పరిహారం వేగంగా జమ చేయాలని సూచించారు. బాధితులకు మానసిక, లీగల్ కౌన్సెలింగ్‌ను



బలోపేతం చేసి వారికి తగిన సహాయం అందించాలన్నారు. భరోసా కేంద్రం సేవల గురించి స్కూళ్లు, కాలేజీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు వేధింపుల నుంచి రక్షణ పొందేలా పోలీసు, భరోసా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. భరోసా కేంద్రం సేవలపై ఎస్పీ ప్రశంసిస్తూ, బాధితుల కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. బాధితులకు ఎప్పటికప్పుడు సహాయంగా ఉండాలని, వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రం ద్వారా పరిహారం పొందిన బాధితులు, ప్రభుత్వం అందిస్తున్న సహాయం గురించి హర్షం వ్యక్తం చేశారు. భరోసా కేంద్రం మహిళలు, చిన్నారుల రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు దీన్ని వినియోగించుకోవాలని ఎస్పీ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో భరోసా టీం సభ్యులు జ్యోష్ణ, జయశ్రీ, పార్వతి, రేణుక, మౌనికతో పాటు ఎస్బీ సీఐ చంద్రమౌళి, రూరల్ సీఐ సరవయ్య, రూరల్ ఎస్ఐ దీపికా, షీ టీం ఎస్ఐ సునంద సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి

### భూగర్భజల శాఖ సూచన

**మహబూబాబాద్ టౌన్ మార్చి 22,నవభూమి:** ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని భూగర్భజల శాఖ ఆధ్వర్యంలో శనివారం కురవి మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి మాట్లాడుతూ, నీటి వృధాను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణాన్ని విరివిగా చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ భవిష్యత్ తరాల కోసం అత్యవసరమని తెలిపారు. జిల్లా భూగర్భజల శాఖ అధికారి వేముల సురేష్ మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగం ఎక్కువగా భూగర్భ జలాలపై ఆధారపడి ఉందని పేర్కొన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు రైతులు పొలాల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు నీటి కుంటలను నిర్మించుకోవాలని సూచించారు. అదనపు వినియోగాన్ని తగ్గించేందుకు ఆరుతడి పంటలను ఎంచుకొని, బిందు సేద్యం పద్ధతులను పాటించాలని సూచించారు. అనవసర బోరింగ్‌కు పాల్పడకుండా, రైతులు భూగర్భజల శాఖను సంప్రదిస్తే, శాస్త్రీయంగా సర్వే చేసి బోర్ వెల్ పాయింట్ సూచిస్తామని వివరించారు. విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు, రైతులకు, మహిళలకు భూగర్భజల సంరక్షణ పద్ధతులు, నీటి పొదుపు విధానాలను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. భూగర్భ జలాలను ఉత్తమంగా నిర్వహిస్తున్న విద్యా విభాగంలో హెర్బ్ కంపెనీ, పరిశ్రమల విభాగంలో



గాయత్రి గ్రానైట్ మైనింగ్, వ్యవసాయ విభాగంలో భూక్య రవికుమార్, హార్టికల్చర్ విభాగంలో భాస్కర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి సునీల్ రెడ్డి, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి వీరబాబు, సహాయ భూగర్భజల అధికారులు శ్రీనివాస్, స్నేహ, చేతన్, సహాయ వ్యవసాయ అధికారి మురళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# యూనిఫైడ్ కౌన్సిల్ పరీక్షలో జయ విద్యార్థుల హవా




**కోదాడ మార్చి22(నవభూమి ప్రతినిధి)** యూనిఫైడ్ కౌన్సిల్ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ లెవల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ లో జయా ఐఐటి ఒలంపియాడ్ విద్యార్థులు సత్తా చాటారు అని కరస్పాండెంట్ జయా వేణుగోపాల్ తెలిపారు. శనివారం పట్టణంలోని జయా ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ ఆయన మాట్లాడారు.కోదాడ నుండి 17 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు.5వ తరగతి నుండి పి కీర్తి, బి హృతిక్ వర్మ, ఎ రితిక్ రెడ్డి. 6వ తరగతి నుండి డి తేజశ్విణి, ఎస్కి జాహిద్, సి హెచ్ నందు.7వ తరగతి నుండి ఎ జశ్విత, బి వంశిక, కె ఆరాధ్య.8వ తరగతి నుండి నౌహియ ఫిర్దస్ ఖాన్, ఎస్కే ఇంతియాజ్ కె శ్రీచరణ్, ఎస్ కె మిన్హాజ్. 9వ తరగతి నుండి పి వికాస్, జి లలితాదిత్య, ఎస్కె అబ్దుల్ ముసావ్విర్.10వ తరగతి నుండి సిహెచ్ అక్షయ్ లు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ప్రతిభను కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులను కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, ప్రధానోపాధ్యాయులు చిలువేరు వేణు అభినందించారు. తమ అత్యుత్తమ ప్రోగ్రామ్ ద్వారా ఇటువంటి విజయాలను భవిష్యత్తులో కూడా సాధిస్తామని తెలిపారు. తమపై విశ్వాసాన్ని ఉంచి అన్ని విధాల సహకరిస్తున్న తల్లిదండ్రులకు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికుల అక్రమ అరెస్టులకు నిరసనగా నేరేడుచర్లలో రాస్తారోకో

**నేరేడుచర్ల-నవభూమి:** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రధాన కూడలిలో శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో అసంఘటిత నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ సత్తార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్ పోర్ట్, బీడీ తదితర రంగాల కార్మికులకు సామాజిక భద్రత చట్టం అమలు చేయాలన్నారు.శుక్రవారం ఛలో హైదరాబాద్ వెళ్తున్న కార్మికులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెల్ఫేర్ బోర్డులోని నిధులను కార్మికులకే ఖర్చు చేయాలని, పెండింగ్ లో ఉన్న క్లైములకు నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించేంతవరకు ఉద్యమాలు ఆగమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల కష్టాలను గుర్తించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల భవన నిర్మాణ సంఘం కోశాధికారి గుంజ రవీందర్, సైదా, సత్యం, రామారావు, నరేశ్, కొండలు, శివ, శ్రీను, నరసింహా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

◆ మంగపేట సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ టీవీఆర్ సూరి




**మంగపేట, మార్చి 22(నవభూమి):** యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్,గేమ్ యాప్‌లకి అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని,అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కి పాల్పడిన,ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడిన,ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని మంగపేట ఎస్ఐ టివిఆర్ సూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న భ్రమలో యువత,విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ కి బానిసలుగా మారి అప్పులపాలపై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అన్నారు.ముఖ్యంగా సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగింది అన్నారు. ఈసోషల్ మీడియా ఇన్ఫ్లుఎన్సర్లు సోషల్ మీడియాలో వీటిని ప్రోత్సహించడం వల్ల యువతలో దీని వ్యసనం పెరుగుతోందని వీటి కట్టడికి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని,అక్రమ బెట్టింగ్ యాప్స్ లలో బెట్టింగ్ కి పాల్పడిన, ఆన్‌లైన్ గేమింగ్ యాప్ లలో గేమ్స్ ఆడిన,ప్రోత్సాహించిన కఠిన శిక్షలు తప్పవని సూరి హెచ్చరించారు.రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసే ఇన్ఫ్లుఎన్సర్లు పై,వ్యక్తులపై కేసులు నమోదు కావడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్ ల నిర్వహకులు సూచనల మేరకే ఆపరేట్ చేయబడుతాయని,బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పెట్టుబడిగా పెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు.ఆన్‌లైన్ గేమింగ్ మాటున ప్రమాదకర మాల్ వేర్ ఉందని, ఫేక్ లింక్స్ తో వ్యక్తి గత సమాచారం, అకౌంట్ వివరాలు తెలుసుకొనే అవకాశం ఉన్నందున గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈఅక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ప్రజలు,యువత అప్రమత్తంగా ఉండి,ఇటువంటి కార్యకలాపాలపై వెంటనే డయల్ 100కు, స్థానిక పోలీస్ వారికి సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూరి తెలిపారు.

## మహబూబాబాద్ మహిళల ఫార్మసీ కళాశాలలో భరోసా, సైబర్ క్రైమ్‌లపై

# షీ టీం అవగాహన సదస్సు






**మహబూబాబాద్ టౌన్ మార్చి 22, నవభూమి:** మహబూబాబాద్ ఎస్పి సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశానుసారంగా ప్రభుత్వ మహిళల ఫార్మసీ కళాశాల, మహబూబాబాద్ నందు షీ టీం, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నేటి కాలంలో నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో, నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తగా మెలగడం ద్వారా నేరాలను అదుపు చేయవచ్చని మహబూబాబాద్ షీ టీం ఎస్ఐ సునంద పేర్కొన్నారు.ఈ అవగాహన కార్యక్రమంలో భరోసా సెంట్రల్ కోఆర్డినేటర్ జోష్ణ, భరోసా సపోర్ట్ పర్సన్ జయశ్రీ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ మహిళ కానిస్టేబుల్ సుప్రజ, షీ టీం సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్ పాల్గొన్నారు.కళాశాల విద్యార్థినీలకు సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈవిటీజింగ్, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలని వివరించారు. ఏ సమస్య ఎదురైనప్పటికీ తక్షణ సాయం కోసం ఎమర్జెన్సీ నెంబర్ డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.తెలియని నంబర్ల నుంచి మహిళలకు ఇబ్బందులు ఎదురైతే లేదా ఎవరికైనా మహిళలపై అనుచితంగా ప్రవర్తించినట్లయితే, ధైర్యంగా షీ టీంకు సమాచారం అందించాలని సూచించారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడకుండా విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించాలని కోరారు.షీ టీం మొబైల్ నెంబర్ 8712656935కు లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచుతామని, నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినిలకు సమస్యలు ఎదురైనప్పుడు వారి కాలేజీ యాజమాన్యంతో లేదా షీ టీంతో పంచుకోవాలని, అలా చేయడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలోనే నివారించవచ్చని పేర్కొన్నారు.విద్యార్థినీ విద్యార్థులందరికీ టీ-సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్ గురించి వివరించి, ప్రతి ఒక్కరు దానిని ఉపయోగించి ప్రయాణాల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళల ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎం. స్వప్న రెడ్డి, అధ్యాపక బృందం, 150 మంది విద్యార్థినీలు పాల్గొన్నారు.

# రాజీవ్ యువవికాస పథకానికి రేషన్‌కార్డు నిబంధనతో నిరుద్యోగుల ఇబ్బందులు

**మహాముత్తారం మార్చి21 నవభూమి:** ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకం రేషన్ కార్డు లేని వారికి నిరాశను మిగిల్చేటట్టు ఉంది. రేషన్ కార్డ్ నిబంధనతో యువత తలలు పట్టుకుంటున్నది. గత ప్రభుత్వ పాలన నిర్లక్ష్యంతో రేషన్ కార్డులు రాక ఏ పథకానికి అర్హత పొందలేకపోతున్నామని యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేటి ప్రభుత్వం ఏర్పడి కూడా ఏడాదిన్నర గడిచిన రేషన్ కార్డులు మంజూరు చేయలేదు, దీంతో చాలామంది యువత దరఖాస్తు చేసుకునేందుకు సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని మహాముత్తారం మండలం స్తంభంపల్లి పీపీ గ్రామానికి చెందిన జంగిడి వినీత్ అనే నిరుద్యోగి తన బాధని వ్యక్తం చేశాడు. ఉమ్మడి కుటుంబంలో పేర్లు ఉండటం, పాత రేషన్ కార్డులో పేర్లు తప్పు ఉండటం, అసలు రేషన్ కార్డులు అప్డేట్ లో లేకపోవడం వంటి సమస్యలతో ఈ పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు నిబంధనకు బదులు ప్రత్యామ్నాయం ఆలోచించి సహకరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



# ఎస్ఎస్‌సి పరీక్షలు

## మహబూబాబాద్‌లో 8177 మంది హాజరు, 8 మంది గైర్హాజరు

**మహబూబాబాద్ టౌన్ మార్చి 22, నవభూమి:** మహబూబాబాద్ జిల్లాలో ఎస్ఎస్‌సి పరీక్షల రెండవ రోజు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించగా, మొత్తం 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ రోజు మొత్తం 8185 రెగ్యులర్ విద్యార్థులకు అలాట్మెంట్ ఉండగా, 8177 మంది హాజరయ్యారు. 8 మంది గైర్హాజరు అయ్యారు. ప్రైవేటు విద్యార్థుల విషయానికి వస్తే, ఇద్దరు అలాట్మెంట్ కాగా, ఇద్దరూ గైర్హాజరు అయ్యారు. పరీక్షల నిర్వహణలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) డాక్టర్ ఏ. రవీందర్ రెడ్డి 4 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అదేవిధంగా అసిస్టెంట్ కమిషనర్ జి.ఈ. మందుల శ్రీరాములు 5 సెంటర్లను పరిశీలించారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మొత్తం 21 పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. హాజరు నమోదు కోసం జిల్లా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హాజరు వివరాలను ఉదయం 10 గంటలకు 9492585375 నెంబర్‌కు సెక్యూరిటీ ద్వారా వెంటనే ఆబ్సెంట్ స్టేట్‌మెంట్ పంపించాలని సంబంధిత సీఎస్, డీఓ లకు సూచించారు.

# బాధిత బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలకు మాజీమంత్రి ఎర్రబెల్లి పరామర్శ

## బీఆర్ఎస్ నేత మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**పాలకుర్తి నవభూమి మార్చి 22** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రం వివిధ గ్రామాల బాధిత బీఆర్ఎస్ కుటుంబాలను పరామర్శించిన మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈకార్యక్రమంలో భాగంగా పాలకుర్తి మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన మట్ట శ్రీను ప్రమాదవాషత్తు ఆక్సిడెంట్ జరగగా విషయం తెలుసుకుని మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం పరామర్శించిచారు. ఈసందర్భంగా బాధితుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పాలకుర్తి మండలం తిరుమలగిరి గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త మారుజోడు పుల్లమ్మ ఇటీవలె మరణించగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు శనివారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నిఖార్సైన కార్యకర్తను కోల్పోయాం మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకొని శనివారం మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మృతుని పార్థిక దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, మృతుని ఆత్మ శాంతించాలని భగవంతుని కోరారు. ఈ కార్యక్రమాలలో.. బీఆర్ఎస్ ,మండలం, గ్రామ నాయకులు ,యూత్ సోషల్ మీడియా నాయకులు ఉన్నారు.





# కేసీఆర్ పాలనలో ఎకరం కూడా ఎండలె..

**స్టేషన్‌ఘన్‌పూర్, నవభూమి:** అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరివ్వకుండా పట్టపగలే చుక్కలు చూపిస్తున్నదని, వారి ఉసురు తప్పకుండా తగులుతుందని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలోని మేకల వెంకటయ్య, గిద్దెబండతం డాలో బానోత్ రాముకు చెందిన ఎండిపోయిన పంటపొలాలను పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అ నంతరం రాజయ్య మాట్లాడుతూ.. మేకల వెంకటయ్యకు చెందిన 4 ఎకరాల పొలం, గిద్దెబండతండాలో బానోత్ రాముకు చెందిన 8ఎకరాల పొలం సాగునీరు లేక ఎండిపోయిందని తెలిపారు. సాగునీరు లేక పంటలు ఎండి నియోజకవర్గంలోని రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అధికారులే పనులు చేపట్టి, రైతులకు సాగునీరు అందించేవారని, కానీ, నేడు తమ స్వార్థం, పేరు కోసం అధికారులను పనులు చేపట్టనీయకుండా, తామే సాగునీటిని విడుదల చేయాలని చూస్తూ జాప్యం చేయడంతో రైతుల పంటలు ఎండుతున్నాయని అన్నారు. ఇందుకు ఉదాహరణే దేవన్నపేట వద్ద ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రొటోకాల్ పాటించకుండా మంత్రులు పొంగులేటిని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బ్లాక్‌మెయిల్ చేసి సాగునీటి విడుదల కోసం తీసుకొచ్చాడని రాజయ్య విమర్శించారు. వ్యవసాయం తప్ప మరో ఆదెరువు లేక, భూమిని నమ్ముకొని కష్టపడే రైతుల పొ లాలు ఎండిపోవడం చూస్తుంటే పానం తరుక్కుపోతున్నదని, గత పదేళ్లలో సాగునీరు, కరెంటు సమస్య లేకుండా రైతులు సంతోషంగా ఉన్న ట్లు తెలిపారు. అబద్ధాల కాంగ్రెస్ వచ్చిన తర్వాతనే వారి జీవితాల్లో చీకట్లు నిండాయన్నారు. ఇప్పటివరకు 468 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ బరాజ్ వద్ద 7.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని, దేవాదుల ఫేస్- 1, ఫేస్- 2, ఫేస్-3 ద్వారా రైతులకు నీరు అందించే అవకాశమున్నా, ప్రభు త్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 31



మెగావాట్ల సామర్థ్యం ఉన్న మూడు మోటర్లను ఆస్ట్రియా నుంచి తీసుకొచ్చి బిగించారని, వాటిని ప్రారంభించడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. రేపటిలోగా దేవాదుల పంప్‌హౌస్ మోటర్లను ఆన్ చేసి ధర్మసాగర్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌కు సాగునీరు అందించాలని, లేకపోతే దేవన్నపేట పంప్‌హౌస్‌ను ముట్టడించి, పెద్దఎత్తున ధర్నా చేపడతామని రాజయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గండిరామారం కుడి కాల్వ ద్వారా నీరు విడుదల చేయాలని, వల్లభరాయుని చెరువు కింద ఎమ్మెల్యే కడియం అనుచరులు తమ పొలాలకు నీరు పెట్టుకుంటూ, కింది రైతులకు వెళ్లకుండా అపుతున్నారని, వీరిపై అధికారులు చర్యలు తీసుకోవలని డిమాండ్ చేశారు. ఆ పదేళ్ల పాలనే మళ్లీ రాబోతున్నది..కేసీఆర్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలతోపాటు రైతులు సైతం సంతోషంగా ఉన్నారని, రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంటు, సాగునీరు, ఎరువులు, రైతుబంధు, రైతుబీమా ఎలాంటి సమస్యలు లేకుండా అందాయన్నారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిలోనే అనేక సమస్యలను రైతులు ఎదుర్కొంటున్నారని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, గత పదేళ్ల పాలనే మళ్లీ రాబోతున్నదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్టాలని, బీఆర్ఎస్‌కు అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజయ్య కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ, మాజి జడ్పీటీసీ మారపాక రవి, గ్రామశాఖ అధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి, నూనవత్ జయపాల్, బానోతు రవీందర్, అక్కనపల్లి వెంకటయ్య, అక్కనపల్లి సత్తయ్య, అక్కనపల్లి బాలరాజు, బానోత్ టాను, అక్కనపల్లి రాజు, గోడుగు సంజీవ, శ్రీధర్, కుంబోజి గౌరిష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. మా పంటలకు సావుగంజి పోయండి సారూ నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. నా ఇద్దరు కొడుకులు, నేను సాగు చేసుకుంటానం. ఈ పొలంపైనే మూడు కుటుంబాలు ఆధారపడి ఉన్నయి. ఇప్పుడు సాగునీరు లేక ఈనిన వరి ఎండిపోతున్నది. రెండు వారాలపాటు సాగునీరు అందితే కొంతవరకు పంటలను కాపాడవచ్చు. లాభాలు కాకున్నా, పెట్టుబడిలో కొంతవరకైనా వచ్చే అవకాశం ఉంది. లేదంటే లాభంతోపాటు పెట్టుబడికి పెట్టిన రూ. లక్ష నష్టపోతాం. ప్రభుత్వం స్పందించి ఎండిపోతున్న పంటలకు సావుగంజి పోసి కాపాడాలి.

# శరవేగంగా రైల్వే మాన్యుఫాక్చరింగ్ పనులు

**వరంగల్, నవభూమి:** కాజీపేట జంక్షన్ శివారులో నిర్మాణమవుతున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. కరీంనగర్, రామగుం డం, వరంగల్ రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృ ద్ధి పనులను తనిఖీ చేస్తూ ప్రత్యేక రైలులో ఉన్నతాధికారులతో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌కు శుక్రవారం చేరుకున్నారు. క్రూ కంట్రోల్ కార్యాలయం లో ఆయన లోకోపైలట్, అసిస్టెంట్ లోకోపైలట్‌లతో సేఫ్టీ అవగాహనపై ముఖాముఖి కార్యక్ర మం నిర్వహించారు. రైలు డ్రైవర్ల సమస్యలు తెలుసుకుని వారికి సూచనలు, సలహాలు అందజేసి, రైల్వేశాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధ్యతల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ నాటికి రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు పూ ర్తయి రైల్ కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభమవుతుందన్నా రు. రైల్వే భద్రతే రైల్వే శాఖ లక్ష్యమని, రైల్వేను కాపాడుకోవడం ప్రతి కార్మికుడి బాధ్యత అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు, ఎస్కలేటర్లు, వెయింట్ హాల్‌ను వీక్షించారు. రైల్వేస్టేషన్‌లోని సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఏకే జైన్‌ను బీజీపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలి సి కాజీపేట రైల్వే దవాఖానను అందుబాటులోకి తేవాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్ స్టేషన్



శిథిలావస్థకు చేరిందని సీఐ సురేందర్ జీఎంకు విన్నవించారు. సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం భర్తేశ్‌కు మార్ జైన్, పీసీఈఎం బ్రహ్మానందం, సీపీటీఎం పద్మజ, పీవోఎం మోహన్, సీనియర్ డీవోఎం సురేశ్‌రెడ్డి, సీనియర్ డీఈ శివప్రసాద్ పాల్గొన్నారు. జీఎం ప్రయాణిస్తున్న రైలింజన్‌కు తప్పిన ముప్పు? వరంగల్-కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య జీఎం ఏకే జైన్ ప్రయాణిస్తున్న స్పెషల్ రైలింజన్‌కు బలమైన ఇనుప వస్తువు తాకడంతో పెను ప్రమాదం తప్పిం ది. రైలుకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఘట నా స్థలంలో రైలు పట్టా ముక్క దొరికింది. కార్మికు లు విధులు నిర్వర్తించి అధికారి స్పెషల్ రైలు వస్తుందని అక్కడే ఆ రైలు పట్టా ముక్కను వదిలారా? గుర్తుతెలియని వ్యక్తులెవరైనా పెట్టారా?%ొ% అంటూ పలు అనుమానాలను రేకెత్తిస్తున్నట్లు రైల్వే అధికారులు చర్చించుకున్నారు. ఈ విషయంపై రైల్వే అధికారులు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

# ఉద్యమకారుల న్యాయమైన హక్కులు పరిష్కరించాలి




**హనుమకొండ నవభూమి:** ఉద్యమకారుల న్యాయమైన హక్కులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 24న ఓరుగల్లుకు బస్సుయాత్ర కరీంనగర్ నుండి హనుమకొండ అమరవీరుల స్థూపం వద్దకు రానున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నందగిరి రజనీకాంత్ తెలిపారు.శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. ఈ నెల 24 న నిర్వహించనున్న బస్సు యాత్రలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు చీమ శ్రీనివాస్ నిర్వహిస్తున్న బస్సు యాత్రలో ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో భాగంగా వందలాది మంది యువకులు అమరులయ్యారని అయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల సాక్షిగా ఉద్యమకారులకు సముచిత ప్రాతినిధ్యం లభించకుండా రాజకీయ పార్టీలు కుతంత్రాలు నడిపిస్తూ హక్కులను హరించి వేస్తున్నాయన్నారు.సబ్బండ వర్గాల ప్రజలు తమ అభీష్టం మేరకు ఉవ్వెత్తున జరిపిన ఆటపాట మానవహారాలు వంటవార్పూ రహదారులపై నిర్వహించి ప్రభుత్వ పాలనను స్తంభింపజేసిన తెలంగాణ రాష్ట్ర సాధన జరుపుకున్న ప్రజల గొంతుకను నొక్కి వేస్తుంది. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి 250 గజాల స్థలం అమరులైన కుటుంబాలకు పెన్షన్ అదేవిధంగా హెల్త్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేసారు. వీటి సాధనకోసం ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజక వర్గ కన్వీనర్ అనుముల రమేష్, వరంగల్ పార్లమెంటరీ కన్వీనర్ వోడపల్లి శ్యామ్ కృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్మిక విభాగ అధ్యక్షుడు జమ్మాల నాగరాజు, ఓడపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దాహం.. దాహం ..?

**చిట్యాల, నవభూమి:** చిట్యాల మండలం కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌లో తాగునీటి కొరత తీవ్రమైంది. గ్రామ ప్రజల రోజూవారీ అవసరాల కోసం గత బీఆర్ఎస్ సర్కారు మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మించి సక్రమంగా సరఫరా చేయడంతో ఇన్నాళ్లు సాఫీగా నీరందాయి. కానీ ప్రస్తుతం ట్యాంకులో నీరు నిండుగా ఉన్నప్పటికీ అధికారుల పట్టింపులేమితో గ్రామంలో కొన్ని ఇళ్లకు మాత్రమే నీరందుతున్నది. ఈ విషయమై పలుమార్లు గ్రామస్తులు సంబంధిత అధికారుల ను కలిసి విన్నవించుకున్నా పట్టించుకోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చేసేదేమీ లేక వ్యవసాయ బోరు బావులు, పత్తి మిల్లు నుంచి ఎడ్లబండ్ల మీద నీళ్లు తెచ్చుకుంటున్నారు.అధికారులు పట్టించుకుంటలేరు..మిషన్ భగీరథ అధికారులకు, గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా సమస్యను పరిషరించడం లేదు. శాంతినగర్‌లో లీకేజీ, గేటు వాల్ సమస్య, ఎత్తు, వంపులు అంటూ కారణాలు చెబుతూ దాటేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు శాంతినగర్లో నీటి సమస్య రాకుండా శాశ్వత పరిషారం చూపాలి. లేకపోతే అవే ఎడ్లబండ్లతో, బిందెలతో రోడ్డు మీద నిరసనలు తెలుపుతాం..అన్న రాజు, శాంతినగర్, చిట్యాల మండలం పడమటి తండాలో రాని భగీరథ జలాలు పెద్దవంగర : పడమటితండాలో తాగునీటికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. తండా కు చాలా రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక అల్లాడుతున్నారు. దీనికి తోడు భూగర్భ జలాలు అంతకంతకూ పడిపోయి తండాలోని బోర్ల నుంచి కొద్దిపాటి నీళ్లు కూడా రావడం లేదు. దీంతో కొంద రు వ్యవసాయ బావుల నుంచి తెచ్చుకుంటున్నారు. మరికొందరు ఇండ్ల వద్ద వచ్చే అరకొర నీటి కోసం గొడవ పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాకు మిషన్ భగీరథ నీటిని అందిం చి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.



# మంత్రుల ఆర్భాటం..
# పంపింగ్ ఆలస్యం..

**వరంగల్, నవభూమి:** దేవన్నపేటలోని పంపుహౌస్‌లో మోటర్లను ఆన్ చేసి అదనంగా 60వేల ఎకరాలకు నీరిచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ ప్రాజెక్టు పరిధిలో నీటి సరఫరా లేక పంటలు ఎండిపోతుండగా ముఖ్యంగా వరి వేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నది. గోదావరిలో నీరున్నా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దేవాదుల పరిధిలోని పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దేవన్నపేట పంపుహౌస్‌లోని మోటర్లను ఎండల తీవ్రతకు ముందే, రెండు వారాల క్రితమే ఆన్‌చేయాల్సి ఉండగా ఇప్పటికీ ఆన్ కావడం లేదు.సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మూడు రోజుల క్రితమే వచ్చి మోటర్లు ఆన్ చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వ నిర్వహణ లోపం, సాంకేతిక సమస్యలతో అవి ఆన్ కాలేదు. ఒక్కరోజులోనే మోటర్లను ఆన్ చేస్తామని మంత్రులు, సాగునీటి శాఖ అధికారులు రోజూ ప్రకటిస్తున్నారు. ఎప్పుడు ఆన్ చేస్తారనేదిపై స్పష్టత లేదు. ఈ పంపుహౌస్‌లో భారీ సామర్థ్యం ఉన్న మూడు మోటర్లు ఉండగా ఆస్ట్రియా కంపెనీ వీటిని అమర్చింది. నిర్వహణ సైతం కంపెనీ ఆధ్వర్యంలోనే ఉంటున్నది.రెండు రోజులుగా ఆ కంపెనీ ఇంజినీర్లు మోటర్లలోని సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పనులు పూర్తయినా ఆస్ట్రియా కంపెనీకి చెందిన ప్రొటోకాల్ ఇంజినీర్ అనుమతి ఇచ్చిన తర్వాతే మోటర్లను ఆన్ చేస్తామని సాగునీటి శాఖ ఉన్నతాధికారి చెప్పారు. సదరు ఇంజినీర్ శనివారం రానున్నట్లు సమాచారం. ఆ ఇంజినీర్ పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వాతే మోటర్లు ఆన్ అయ్యే పరిస్థితి ఉన్నదని సాగునీటి శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆస్ట్రియా



ఇంజినీర్ వచ్చిన తర్వాత ఇంకేమైనా సాంకేతిక సమస్యలను గుర్తిస్తే పంపులను ఆన్ చేయడం మరింత ఆలస్యమవుతుందని చెప్పారు.కేసీఆర్ హయాంలోనే పూర్తి..కేసీఆర్ హయాంలోనే దేవన్నపేట పంపుహౌస్ పూర్తయ్యింది. కానీ కాంగ్రెస్ ఘనతగా చెప్పుకొనేందుకు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి మోటర్లను ఆన్ చేస్తున్నట్లు ప్రకటించి, ఈ నెల 18న దేవన్నపేటకు వచ్చారు. అక్కడ రెండు గంటలున్నా మోటర్లు ఆన్ కాలేదు. చేసేది లేక రాత్రి వరకు ఆన్ చేస్తామని, మోటర్లు నడిచిన తర్వాతే హైదరాబాద్ వెళ్తామని ఆర్భాటంగా ప్రకటించారు. సాగునీటి అధికారులు వాస్తవ పరిస్థితిని వివరించడంతో మోటర్లు కావని గ్రహించి అదే రాత్రి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఆన్‌అయ్యే వరకు వరంగల్‌లోనే ఉంటామని ప్రకటించిన మంత్రులకు మూడు రోజులుగా ఇబ్బందికర పరిస్థితి నెలకొన్నది. మోటర్లు ఎప్పటిటి ఆన్ ఆవుతాయో చెప్పాలని ఇద్దరు మంత్రులు పదేపదే సాగునీటి శాఖ ఉన్నతాధికారులను ఆరా తీస్తున్నారు.తాము హడావుడిగా ఆన్ చేసినా పంపులు రన్ కాకపోవడంతో ఈ విషయం చర్చనీయాంశమైందని.. పంపులు త్వరగా ఆన్ అయ్యేలా చూడాలని బతిమాలుతున్నారు. పంపింగ్‌పై సాగునీటి శాఖ ఎలాంటి ప్రయోగాత్మక చర్యలు చేపట్టకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. పంపింగ్ మొదలుపెట్టే ముందు మొదట డ్రైరన్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రయోగాత్మకంగా కొద్దిసేపు పంపింగ్ చేయాలి. అవేమీ చేయకుండా పబ్లిసిటీ కోసం మంత్రులు వచ్చి నేరుగా పంపింగ్ కోసం ఆన్ చేయాలనుకోవడంతో అసలు విషయం బయటపడింది. ఇప్పుడు అదే విషయమై రైతుల్లో చర్చ జరుగుతున్నది. మోటర్లు ఆన్ అయితే గంటలలోనే తమ ప్రాంతాలకు నీళ్లు వచ్చేవని, మంత్రులు చెప్పిన మాటలకు నీటి రాకకు పొంతన కుదరడం లేదని రైతులు అంటున్నారు.

## అసెంబ్లీలో ప్రతిపక్షాలపై
# విరుచుకుపడ్డ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి నవభూమి మార్చి 22** హైదరాబాద్ అసెంబ్లీ: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశశ్విని రెడ్డి నియోజకవర్గ పరిధిలో రైతుల పంట పొలాలకు సాగునీరు అందించేందుకు కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అసెంబ్లీలో కోరారు.తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా జీరో ఆవర్ లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. దేవాదుల కాలువలను తవ్వి ఏళ్లు గడుస్తున్నప్పటికీ కాలువల్లో ఉన్న పూడికతీతను తొలగించడంలో గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. కాలువల ద్వారా రైతులకు సక్రమంగా సాగునీరు అందించాలనే లక్ష్యంతో సొంత ఖర్చులు పెట్టుకొని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామని చెప్పారు. నియోజకవర్గంలో మరికొన్ని కాలువల్లో పూడికతీత పనులు అలానే ఉన్నాయని ఓఎన్ఎమ్ ద్వారా అభివృద్ధి చేయాలని స్పీకర్ ద్వారా మంత్రిని కోరారు. పూడికతీత పనులు చేపట్టకుంటే రైతులకు సకాలంలో సాగునీరు అందదని అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. పదేళ్లలో చేయలేని అభివృద్ధిని 15 నెలల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసి చూపిందని వివరించారు. పదేళ్లుగా కాలువల మరమ్మతు పనులు చేసి ఉంటే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి జీర్ణించుకోలేకనే ప్రతిపక్షాలు అసూయ పడుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమ అమలును తట్టుకోవడం లేదన్నారు. గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థుల సంక్షేమం కోసం 40% మెస్ ఛార్జీలు, 200 కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. పదేళ్ల మంచిని మేము ఎత్తుకెళ్లలేదని, పదేళ్లుగా ప్రజలను విస్మరిస్తేనే ప్రజలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అధికారంలోకి తెచ్చారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందించడంతో వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. చిరు వ్యాపారులను ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ఏదైనా ఒక మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల ప్రతిపక్షాలు విమర్శలు మాని అభివృద్ధి సంక్షేమ పథకాలకు బాసటగా నిలవాలని ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు సూచించారు. మా ప్రాంతంలో ఇళ్లపై నుండి 11 కెవి విద్యుత్ తీగలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

